
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

3 జయశంకర్ భూపాలపల్లి
సోమవారం 13 జనవరి 2025


ఆలయ శిఖరంపై జెండాను ఎగురవేస్తున్న అర్చకుడు

విద్యుత్ వెలుగుల్లో ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయం

# మల్లన్న జాతరకు బైలెల్లె జనం..

ఐనవోలులో వైభవంగా ధ్వజారోహణం

- ఉత్సవాలు ప్రారంభమైనట్లు అర్చకుల ప్రకటన
- ఆలయానికి తరలివస్తున్న భక్త జనం
- విధుల్లో చేరిన వివిధ శాఖల అధికారులు
- చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా గౌరవీ శంకర్

5

# కొత్తకొండ జాతరకు పోయొద్దామా..

నేడు ప్రారంభం కానున్న పెద్ద జాతర

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జాతరలో ఉచిత వీఐపీ పాస్‌ల రద్దు
- 600 మంది పోలీసులతో బందోబస్తు
- సీసీ కెమెరాల నిఘాలో కొత్తకొండ జాతర

5


కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో స్వామివారికి లక్ష బిల్వార్చన



# కలగాలె.. భోగభాగ్యం..

- నేడు భోగి పర్వదినం

పండించిన పంటలు ఇంటికి చేరవేసి కుటుంబ సభ్యులందరితో ఆనంద ంగా జరుపుకునే పండుగే సంక్రాంతి. అల్లుళ్ల, కూతుళ్ల, బంధుమి త్రులను పండుగకు ఆహ్వానించుకొని మూడు రోజుల పాటు జరుపుకునే పండుగ సందడి ఆదివారం నుంచే మొదలైంది. ఇంటికి మామిడి తోరణాలు, బంతి పూల మాలలు కట్టి ఇళ్ల ముంగిళ్లను రంగవల్లులతో తీర్చిదిద్ది గొబ్బెమ్మలను ఏర్పాటు చేసి సంబరంగా వేడుకలు జరుపు కుంటారు. సంక్రాంతి సంబరాలకు పల్లెలు, గ్రామా లు, పట్టణాలు ముస్తాబ య్యాయి. ముత్యాల ముగ్గులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దుల విన్యాసా లతో మూడు రోజుల పాటు వేడుకలను వైభవంగా నిర్వహించేం దుకు జిల్లాలోని ప్రజలు సిద్ధమయ్యారు. నేడు (సోమవారం) భోగి, రేపు (మంగళవారం) సంక్రాంతి, ఎల్లుండి (బుధవారం) కనుమ పండుగలను జరుపుకోనున్నారు. నోములు ఆచరిం చేవారు పూజా సామగ్రివస్తువులు కొనుగోలు చేసి సిద్ధం చేసుకున్నారు.



6

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

పేదోడి సొంతింటి కల సాకారం కాబోతోంది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. గత ప్రభుత్వం పదేళ్లలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో సాధ్యం కాలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన నేపథ్యంలో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టింది. గత ఏడాది డిసెంబరు 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు స్వీకరించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వచ్చిన 10,05,454 దరఖాస్తులను పరిశీలించిన అధికారుల బృందం.. 2,73,751 మందిని అర్హులుగా గుర్తించింది. తొలి విడతలో సొంత జాగ ఉన్నవారికే ప్రాధాన్యత ఇవ్వనుంది. జిల్లా కలెక్టర్లు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి ఆమోదంతో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానుంది. దీంతో ఎన్నో ఏళ్ల సొంతింటి కల సాకారం అవుతుందనే ఆనందం ఓరుగల్లువాసుల్లో వ్యక్తం అవుతోంది.



# కలల సౌధం అందే తరుణం..

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సర్కారు సన్నాహాలు

- ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు
- తొలి విడతలో ఇంటి జాగ ఉన్నవారికే ప్రాధాన్యం
- ప్రతీ ఇంటికి రూ.5లక్షలు, ఒక కుటుంబానికి ఒకటే ఇల్లు
- రెండో విడతలో ఇంటి జాగతో పాటు ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక
- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 10,05,454 దరఖాస్తులు
- సర్వే అనంతరం 2,73,751 మంది అర్హులుగా గుర్తింపు
- తొలివిడతలో 50వేలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయింపు

### పదేళ్ల నిరీక్షణకు తెర

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి సొంత ఇంటి కోసం నిరుపేదలు ఎదురుచూస్తున్నారు. 2014లో స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అంతకుముందు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని రద్దు చేసి, పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని హమీ ఇచ్చింది. 2016-17 నుంచి 2018-19 వరకు మూడేళ్లకాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు 32 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో ఐదువేల ఇళ్లు కూడా పూర్తి కాలేదు. కాంట్రాక్టర్లు సైతం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించేందుకు ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వం గృహలక్ష్మీ పేరుతో ఇళ్లు నిర్మించుకునేవారికి రూ.3లక్షల సాయాన్ని అందిస్తామని ప్రకటించింది. ప్రతీ నియోజకవర్గానికి 3వేల ఇళ్ల చొప్పున ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 40వేల ఇళ్లు మంజూరయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 2,58,090 దరఖాస్తులను కూడా స్వీకరించింది. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి 1,91,240మంది అర్హులను గుర్తించారు. కొన్నిచోట్ల గృహలక్ష్మీ ఇంటికి ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చారు. అయితే ఎన్నికల కోడ్ రావటంతో ఆ పథకం కూడా పేదలకు అందకుండా పోయింది. పదేళ్లుగా పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, గృహలక్ష్మీ పథకం ఇళ్లు ఏవీ కూడా అందని ద్రాక్షగా మారాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హమీ మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అడుగులు వేస్తోంది.

### 2,73,751 మంది అర్హులు

ఇందిరమ్మ ఇళ్లకు తొలి విడత సొంత జాగ

మిగతా 4వ పేజీలో...

### 50 వేల ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హమీ మేరకు మార్చి 11, 2024వ తేదీన ఇందిరమ్మ ఇళ్లకు సీఎం రేవంత్‌రెడ్డి భద్రాచలంలో శ్రీకారం చుట్టారు. ఆ తరువాత గత ఏడాది డిసెంబరు 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలనలో అధికారులు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరించారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ లెక్కన ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు 42వేల ఇళ్లు రానున్నాయి. అలాగే పెద్దపల్లి జిల్లాలోని మంథని నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాలు, భద్రాచలం నియోజకవర్గ పరిధిలోని వాజేడు, వెంకటాపురం మండలాలు, హుజూరాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గాల పరిధిలోని కమలాపూర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలు, ఇల్లందు నియోజకవర్గంలోని గార్ల, బయ్యారం మండలాలు ఓరుగల్లు ఇలాఖాలో కలిసిపోయాయి. దీంతో వీటితో కలిపి ఓరుగల్లుకు సుమారు 50వేలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు రానున్నాయి. మొత్తం 100శాతం సబ్సిడీతో ప్రభుత్వం రూ.5లక్షల వ్యయంతో ఇందిరమ్మ ఇంటిని నిర్మించనుంది. ఒక కుటుంబంలో ఒకరికే ఇందిరమ్మ పథకం ద్వారా ఇంటిని మంజూరు చేయనున్నారు.

### అర్హుల ఎంపిక

ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాల వ్యాప్తంగా 10,05,454మంది ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తులు చేసుకున్నారు. పది రోజులుగా అధికారులు ప్రత్యేక యాప్ ద్వారా దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించారు. ప్రధానంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. స్థానికులై ఉండి.. సొంత జాగ ఉన్నవారికి, ఇళ్లు లేనివారికి, గుడిసెలో నివాసం ఉంటున్నవారికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించింది. మట్టి గోడలు, పెంకుటిల్లు, అద్దె ఇళ్లలో ఉంటున్నవారికి కూడా ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఇప్పటికే అసంపూర్తిగా ఇంటిని నిర్మించుకున్నవారికి, ఆర్‌సీసీ కప్పులేని వారు, ఇటుక గోడలు లేని ఇంటికి, యువ వితంతువు, భూమిలేని వ్యవసాయ కార్మికులు, పారిశుధ్య కార్మికులు, వికలాంగులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వనుంది. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా కలెక్టర్లు లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. లబ్ధిదారుల జాబితాను గ్రామసభ లేదా వార్డు సభల్లో ప్రకటిస్తారు. అలాగే రూ.ఐదు లక్షలను ఇంటి నిర్మాణంలో వివిధ దశల్లో అందిస్తారు. బేస్‌మెంట్ పూర్తిచేస్తే రూ.1లక్ష, స్లాబ్ లెవల్‌లో మరో రూ.1లక్ష, స్లాబ్ పూర్తయిన తరువాత రూ.2లక్షలు, ఇల్లు మొత్తం పూర్తిచేసిన తరువాత మిగతా రూ.లక్ష లబ్ధిదారులకు అందించనున్నారు.

| జిల్లా | వరంగల్ | హనుమకొండ | జనగామ | మహబూబాబాద్ | భూపాలపల్లి | ములుగు | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|
| దరఖాస్తులు | 2,33,636 | 1,96,703 | 1,43,187 | 2,17,591 | 1,23,469 | 90,863 | 10,05,454 |
| సర్వే పూర్తయినవి | 2,21,316 | 1,82,228 | 1,34,696 | 1,95,505 | 1,16,217 | 87,315 | 9,37,272 |
| అర్హత పొందిన వారు | 66,622 | 49,863 | 32,448 | 56,274 | 36,096 | 32,448 | 2,73,751 |


హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

# పేదోడి ఇంటికే సంక్షేమ పథకాలు

- 26 నుంచి మరో నాలుగు పథకాలు ప్రారంభం
- 16 నుంచి గ్రామ సభలను పారదర్శకంగా నిర్వహించాలి
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్షా సమావేశం

5

## ఘనంగా స్వామి వివేకానంద జయంతి

భూపాలపల్లిటౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. జిల్లా యువజన, క్రీడల అధికారి రఘు అధ్యక్షతన ఆ శాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత పెడదారి పట్టకుండా వివేకానంద జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. ఈకార్యక్రమంలో ఖేలో ఇండియా కోచ్ శ్రీనివాస్‌రెడ్డి, బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్రాచారి, తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు దిలీప్, శ్రీకాంత్, వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధి కృష్ణ, కార్యాలయ సిబ్బంది శివసాగర్ తదితరులు పాల్గొన్నారు.


స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న క్రీడా శాఖ అధికారులు

## ఓపెన్‌కాస్ట్-3లో చోరీ?

గణపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్-3లో చోరీ జరిగినట్లు సమాచారం. వారం రోజుల వ్యవధిలోనే గుర్తు తెలియని వ్యక్తులు విలువైన కాపర్ కేబుల్, మూడు ట్రాన్స్ మిషన్ ఆయిల్ బ్యారెల్స్, ఒక కూలెంట్ ఆయిల్ బ్యారెల్‌ను ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది. ఈ విషయం ఆలస్యంగా గుర్తించిన సింగరేణి అధికారులు దిద్దుబాటు చర్యలకు పూనుకుంటున్నట్లు సమాచారం. ఈ విషయమై ప్రాజెక్ట్ అధికారి బిక్షమయ్యను వివరణ కోరగా ఆయిల్ బ్యారెల్ పోయినట్లు తమ దృష్టికి రాలేదన్నారు. ఒక చోట ఉన్న వాటిని మరొక చోటికి మారుస్తున్నామని తెలిపారు. వాటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ట్రాన్స్ మిషన్, కూలెంట్ ఆయిల్‌ను ఎక్కువగా వాడడంలేదన్నారు. అవసరమైతే క్యాన్ల ద్వారా తీసుకెళ్లి వాడుకుం టారన్నారు. అయినప్పటికీ ఇంజనీర్లను అడిగి చోరీ విషయాన్ని నిర్ధారణ చేసుకుంటామన్నారు. వాస్తవమేనని తేలితే విచారణ చేపడతామని తెలిపారు. అయితే.. 25 మీటర్ల కేబుల్ చోరీకి గురైన విషయం వాస్తవమేనని, దానిని ప్రాజెక్ట్ పరిధిలోని డంప్‌యార్డ్ సమీపంలో గుర్తించి రికవరీ చేశామని పేర్కొన్నారు.

# పండుగ పూట.. జర జాగ్రత్త!

- సొంతూళ్లకు వెళ్లే వారిని అప్రమత్తం చేస్తున్న పోలీసులు
- ఇంట్లో విలువైన వస్తువులు ఉంచొద్దని సూచన

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వచ్చిందంటే చాలు.. చాలా మంది సొంతూళ్లకు పయనమవు తుంటారు. పిల్లలకు సెలవులు ఎక్కువ ఉండటంతో తమ పెద్దలతో కలిసి పండుగను చేసుకొనేందుకు బయల్దేరు తుంటారు. మరికొందరు ఉద్యోగులు, వ్యాపారులు, ఇతర రంగాల వారూ సంక్రాంతి సంబరాలు జరుపుకోవడాని సొంతూరికి వెళ్తుంటారు. అయితే.. ఇంటికి తాళాలు వేసి వెళ్తున్న వారు అప్రమత్తంగా ఉండాలం టున్నారు పోలీసులు.



### ఆదమరిస్తే అంతే సంగతులు..

సొంతూళ్లకు వెళ్లేవారు ఆదమరిచి ఆదరాబాదరగా వెళితే ఆ తర్వాత ఎదురయ్యే పరిణామాలతో ఇబ్బందులు చవి చూడాల్సి వస్తుందని పోలీసులు అలర్ట్ చేస్తున్నారు. దొంగలు చేతివాటం ప్రదర్శించే ప్రమాదం ఉన్న దృష్ట్యా ఇంటికి పటిష్టమైన తాళంవేయ డంతోపాటు మరికొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాల ంటున్నారు. ఆభరణాలు, డబ్బులు వెంట తీసుకుపోవడం లేదా బ్యాంకులో జమ చేయిడడం ఉత్తమమని సూచిస్తున్నారు. విలువైన సామాన్లకు రక్షణ కల్పించే చర్యలు చేపట్టాలంటున్నారు. రెండు మూడు రోజుల కన్నా ఎక్కువ రోజులు ఇంటిని వదిలి వెళ్లే పరిస్థితులు ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అంటున్నా రు. చుట్టు పక్కల వారిని ఇంటిని గమనిస్తూ ఉండమని చెప్పాలని సూచిస్తున్నారు. ఇంటి చుట్టు పక్కల వారి సెల్‌ఫోన్ నెంబర్‌లు ఉంచుకోవాలని అంటున్నారు. చోరీ లాంటిది మీ ఇంటి వద్ద సంఘటన జరిగినట్టు ఇరుగుపొరుగు వారు సమాచారం ఇవ్వగానే తక్షణ సహాయం కోసం టోల్‌ఫ్రీ నెంబర్ డయల్-100ను వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.

### పతంగులు ఎగురవేసేటప్పుడు...

సంక్రాంతి సందర్భంగా పతంగులను ఎగురవేయడం ఆనవాయితి. ఈ సమయంలో శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పోలీసులు అంటున్నారు. భవనాలపై పతంగులు ఎగరవేసే వారు ముందస్తు జాగ్రత్తతో పిల్లలను కనిపెడుతూ ఉండాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా భవనాలపైన, గోడలపైన, వాటర్ ట్యాంకులపై ఎక్కడం ప్రమాదకరమని అంటున్నారు. ముఖ్యంగా పతంగులు ఎగురవేసేందుకు సాధారణ దారాన్ని వాడాలని, మాంజా ను వినియోగించొద్దని అంటున్నారు. దీంతో గాయాలు ఏర్పడి ప్రాణాలు సైతం పోతున్నాయని తెలిపారు.

### నిరంతరాయంగా నిఘా ఉంటుంది

- కిరణ్‌ఖరే, ఎస్పీ (జయశంకర్ భూపాలపల్లి)



పండుగ వేళ జిల్లా వ్యాప్తంగా పోలీసుల నిరం తరాయంగా ప్రత్యేక నిఘా ఉంటుంది. సొంతూళ్లకు వెళ్లే వారు తప్పకుండా జాగ్రత్తలు పాటించాలి విలువైన సామాన్లు, ఆభరణాలు, డబ్బులు ఇంట్లో పెట్టి వెళ్లొద్దు. ఏదైన సమస్య ఎదురవైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. రాత్రి వేళల్లో కాలనీలు, గ్రామాల్లో గస్తీ ఉంటుంది. చోరీలకు యత్నించడం వంటి దుశ్చర్యలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తాం.



# ఆగని కలప స్మగ్లింగ్ !

- జోరుగా పెద్దేగి, జిట్రేగి అక్రమ రవాణా
- చర్యలు తీసుకోని ఫారెస్టు ఆఫీసర్లు
- కొందరు అధికారులపై సర్వత్రా అనుమానం
- అక్రమ వ్యాపారానికి సహకరిస్తున్నారనే ఆరోపణలు

వివరాలు 4వ పేజీలో...

# సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


ముగ్గుల పోటీల్లో బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని కారల్‌మార్క్స్‌కాలనీలో 25వ వార్డు కౌన్సిలర్ స్వామి ఆధ్వర్యంలో జరిగిన ముత్యాల ముగ్గుల పోటీలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. విజేతలైన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతీ సంప్రదాయాలను మహిళలు కాపాడుతుండడం గర్వకారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహరెడ్డి, బుర్ర కొంరయ్య, రమేష్, సాంబమూర్తి పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదివారం పంపిణీ చేశారు. ఆయన క్యాంపు ఆఫీసులో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యానికి గురైన కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతగా చేయూతను అందిస్తోందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నామని అన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులను 119 మందికి అందజేసినట్లు తెలిపారు. ఆపదలో సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఎంపీ ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులకు తినిపించారు. అనంతరం పెరిక సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి దంపతులు

## సీఎంను కలిసిన పాలకుర్తి ఎమ్మెల్యే

తొర్రూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి దంపతులు ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజల శ్రేయస్సు కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల నిధులు త్వరగా అందించాలని కోరారు. పెండింగ్ పనుల కోసం అవసరమయ్యే నిధులను మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా కార్యకర్తలు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

### ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్



గురుకులాల ప్రవేశ పరీక్ష పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాంచందర్‌నాయక్

కురవి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని బడుగు, బలహీనవర్గాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ సూచించారు. రాజోలులో ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశ పరీక్ష పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు, ఎస్సీ ఎస్టీ గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతుల్లో ఖాళీలకు, సీవోఈ అలుగునూరు, గౌలిదొడ్డిలలో 9వ తరగతి ప్రవేశాలకు, రుక్మాపూర్ సైనిక్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశాలకు కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ఫిబ్రవరి 23న ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి 1 చివరి తేదీ అన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నర్సింహులపేట సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపాల్ ఆమెడ అరుణశ్రీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం, కొర్ని రవీందర్‌రెడ్డి, వద్దుల సురేందర్‌రెడ్డి, బండి శ్రీనివాస్, ఎర్ర నాగేశ్వర్‌రావు, దడిగెల శరత్, ఇ.ఉప్పలయ్య పాల్గొన్నారు. అలాగే రాజోలులోని పురాతన వరదరాజుల స్వామి దేవాలయంలో రాంచందర్‌నాయక్ ప్రత్యేక పూజలు జరిపారు. అర్చకులు ఎమ్మెల్యేకు సాదరంగా స్వాగతం పలికారు.

## కలల సౌధం అందే తరుణం

(3వ పేజీ తరువాయి)

ఉన్నవారికే ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10,05,454 మంది ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తులు చేసుకోగా, పది రోజులుగా అధికారులు ప్రత్యేక యాప్ ద్వారా దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9,37,272 దరఖాస్తులను అధికారుల బృందం పరిశీలించింది. కొన్ని చోట్ల యాప్‌లో సాంకేతికత సమస్య రావటం, కొందరు దరఖాస్తుదారులు అందుబాటులో లేకపోవటం, మరికొందరు వృత్తిరిత్యా నగరాలకు వెళ్లటం వంటి కారణాలతో వందశాతం సర్వే పూర్తి కాలేదు. దాదాపు 92శాతం దరఖాస్తులు పూర్తి కాగా, మిగతా దరఖాస్తులను కూడా పరిశీలిస్తున్నారు. పరిశీలించిన దరఖాస్తుల్లో అధికారులు అన్ని కోణాల్లో పరిశీలించి అర్హులను గుర్తించారు.

వరంగల్ జిల్లాలో 66,622 మంది అర్హులుగా గుర్తించగా, హనుమకొండ జిల్లాలో 49,863 మందిని, జనగామ జిల్లాలో 32,448 మందిని అర్హులుగా గుర్తించారు. అలాగే మహబూబాబాద్ జిల్లాలో 56,274 మంది లబ్ధిదారులను, అలాగే భూపాలపల్లి జిల్లాలో 32,448 మంది, ములుగు జిల్లాలో 32,448 మంది ఇందిరమ్మ ఇళ్లకు అర్హులుగా గుర్తించారు. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 2,73,751 మందిని అర్హులుగా గుర్తించారు. వీరికి తొలి విడతలో వీరికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. అయితే గత ప్రభుత్వం కూడా 2023-24లో గృహలక్ష్మీ పథకం కింద దరఖాస్తులను స్వీకరించి 1,91,240 మంది అర్హులను గుర్తించారు. అప్పటితో పోల్చితే 78వేల మందికి పైగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించారు. అయితే అప్పట్లో కేవలం 2,58,090 దరఖాస్తులే గృహలక్ష్మీ ఇళ్ల కోసం వస్తే.. ఇందిరమ్మ ఇళ్ల కోసం 10,05,454 దరఖాస్తులు వచ్చాయి.

# ఆగని కలప స్మగ్లింగ్!

- జోరుగా పెద్దేగి, జిట్రేగి అక్రమ రవాణా
- చర్యలు తీసుకోని ఫారెస్టు ఆఫీసర్లు
- ఆ శాఖ కొంత మంది అధికారులపై అనుమానం
- అక్రమ వ్యాపారానికి సహకరిస్తున్నారనే ఆరోపణలు

కాటారం/మహాముత్తారం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాలోని కాటారం సబ్ డివిజన్ పరిధిలో కలప అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పెద్దేగి, జిట్రేగి కలప దందా జోరుగా కొనసాగుతోంది. టేకు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో పెద్దేగి, జిట్రేగి కలపను స్మగ్లింగ్ చేస్తున్నారు. ఆంధ్రప్రాంతంతో పాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తూ ఈ చీకటి దందాను సాగిస్తున్నారు. పెగడపల్లి, పలిమెల రేంజ్‌ల పరిధిలోని అడవుల నుంచి పెద్దేగి, జిట్రేగి మాయమవుతున్నాయి. కొందరు అధికారులు స్మగ్లర్లతో మిలాకత్ అయ్యి ఈ దందాకు ఊతమిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆంధ్ర ప్రాంతానికి చెందిన వ్యక్తితో ఓ అధికారి కుమ్మక్కై వనసంపదను హరిస్తున్నారని తెలుస్తోంది.

విలువైన పెద్దేగి, జిట్రేగి చెట్లు వందలాదిగా మాయమై అడవులు బోసిపోతున్నా అటవీశాఖ ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు అధికారులు, సిబ్బంది స్మగ్లర్లు విదిలించే కాసులకు ఆశపడి ఈ అక్రమ వ్యాపారానికి సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

### భారీగా చెట్ల నరికివేత

పెగడపల్లి రేంజ్ పరిధిలో స్మగ్లర్లు నాలుగు రోజుల క్రితం భారీగా పెద్దేగి చెటన్లు నేలకూల్చారు. కోసిన చెట్లను కొందరు అధికారుల సహకారంతో దుంగలుగా మార్చి రవాణా చేయడానికి సిద్ధమయ్యారు. దీనిపై గత నెల 6న కాటారం డివిజన్ అడవుల నుంచి విలువైన పెద్దేగి, జిట్రేగి కలప మాయమవుతున్న విషయమై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. దీంతో హడావుడి చేసిన అధికారులు నామమాత్రంగా అడవులను పరిశీలించి నరికిన చెట్లకు నెంబరింగ్ చేసి చేతులు దులుపుకున్నారు.

స్మగ్లింగ్‌పై సమగ్ర విచారణ చేపట్టి దందాకు సహకరించే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అధికారుల ఉదాసీనత కారణంగా స్మగ్లర్లు మళ్లీ రెచ్చిపోతున్నారు. విలువైన పెద్దేగి, జిట్రేగి కలపను అడవులు దాటించి అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

### గతంలో టేకు.. ఇప్పుడు పెద్దేగి, జిట్రేగి

కొన్నేళ్లుగా టేకు చెట్లు మాయం కావడంతో కొందరు స్మగ్లర్ల కన్ను నాణ్యమైన జిట్రేగి కలపపై పడింది. ఆంధ్ర ప్రాంతంతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ సంపన్నులు జిట్రేగి కలపను కొని గృహోపకరణాలు చేసుకుంటుండటం స్మగ్లర్లకు కలిసొచ్చింది. పెగడపల్లి, పలిమెల రేంజ్‌ల పరిధిలోని అడవుల్లో జిట్రేగి. పెద్దేగి కలప అత్యంత నాణ్యతతో విలువైనదిగా ఉండటంతో స్మగ్లర్లు కొందరు అటవీ అధికారులను లైన్‌లో పెట్టి తమకు సహకారం అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. దీంతో వందలాది పెద్దేగి, జిట్రేగి చెట్లు మాయమవుతున్నాయి.



పెగడపల్లి రేంజ్ పరిధిలో స్మగ్లర్ల దెబ్బకు నేలకూలిన పెద్దేగి చెట్లు (ఇన్‌సెట్‌లో) రంపంతో కోసిన జిట్రేగి చెట్టు

### దుంగలుగా మార్చి..

డివిజన్ పరిధిలోని పలు సెక్షన్ల అడవుల్లో కొట్టిన జిట్రేగి, పెద్దేగి చెట్లను యంత్రాల సాయంతో దుంగలుగా మార్చి మహాముత్తారం, కాటారం మండలాల మీదుగా భూపాలపల్లి పట్టణ సమీప గ్రామాల పరిధిలోకి తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అక్కడ రహస్యంగా నిల్వ చేసి కలపను ఆంధ్రతో పాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని తెలుస్తోంది. ఈ విషయమై భూపాలపల్లి సీసీఎఫ్ ప్రభాకర్, డీఎఫ్‌వో నవీన్‌రెడ్డిని వివరణ కోరగా కలప దందాపై పూర్తి స్థాయి విచారణ చేయిస్తామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## నియామక పత్రం అందుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు



మంత్రి శ్రీధర్‌బాబు నుంచి నియామక పత్రం అందుకుంటున్న సుగుణ

కాటారం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలుగా నియమితులైన ఆంగోత్ సుగుణ ఆదివారం నియామక పత్రాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా అందుకున్నారు. పలువురు కాంగ్రెస్ నాయకులతో పాటు హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసిన సుగుణ శాలువాతో సత్కరించి తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు కిషన్‌నాయక్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మాజీ ఎంపీటీసీ, సర్పంచులు తెప్పల దేవేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, నవీన్‌రావు, రఘురాంనాయక్, వేమునూరి రమేష్‌రెడ్డి, బాసాని రఘువీర్, నాయకులు తెప్పల ప్రభాకర్, కోసరి భాస్కర్, ఆత్మకూరి కుమార్, ముత్తయ్య, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పంట భూమిలో అక్రమంగా హద్దురాళ్లు

### పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు

మరిపెడ రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తండా ధర్మారానికి చెందిన బి.సూర్యానాయక్, హర్జనాయక్‌లకు చెందిన పంట భూమిలో అదే గ్రామానికి చెందిన గుగులోతు శ్రీను అక్రమంగా హద్దు రాళ్లు (గెట్టు రాళ్లు) వేశారని, గెట్టు రాళ్లను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోనే తండా ధర్మారంలో సర్వే నెంబర్ 170-అ లో 2ఎకరాల 33 గుంటల భూమి ఉందన్నారు. ఆ భూమి తాతముత్తాల నుంచి ఉందన్నారు. అదే గ్రామానికి చెందిన గుగులోత్ శ్రీను సదరు భూమి మధ్యలో నుంచి హద్దురాళ్లను వేశారన్నారు. ఆ హద్దు రాళ్లను తొలగించడానికి వెళ్లితే దౌర్జన్యానికి పాల్పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.



ధర్మారంలో అక్రమంగా హద్దురాళ్లు ఏర్పాటు చేసిన దృశ్యం



ముగ్గుల పోటీల విజేతలతో సీపీఐ, ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ నేతలు

## చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలి

### సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం పెరగాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. మహబూబాబాద్ వీరభవన్ వద్ద సీపీఐ, అనుబంధ భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) ఆధ్వర్యంలో తోట విజయ్ స్మారక సంక్రాంతి ముగ్గుల పోటీలను ఆదివారం నిర్వహించారు. వందమంది మహిళలు పాల్గొని సాంస్కృతి, సంప్రదాయ ముగ్గులు వేశారు. ఇందులో ప్రథమ స్థానంలో నిలిచిన కోడి స్వప్న, ద్వితీయ స్థానంలో నిలిచిన ఇసంపల్లి స్వప్న, తృతీయ స్థానంలో నిలిచిన కాడబోయిన భవానీ, నాలుగవ స్థానంలో నిలిచిన మాదారపు కవితతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులు అందించారు. న్యాయనిర్ణేతలుగా నూకల గీతా రెడ్డి, మమత వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథి, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మామిండ్ల సాంబలక్ష్మి, పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, రవి, శ్రావణ్, తోట రాజకుమారి, చిదిరాల జ్ఞానేశ్వర్, పద్మం ప్రవీణ్, రంజిత్, వెంకటేష్, పాల శ్రీను, యాకమ్మ, రాణి. అలీమ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు చంటి



కాటారం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్టీ గురుకులానికి చెందిన విద్యార్థి ఎం.చంటి ఎస్‌జీఎఫ్‌ఐ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. అండర్-17 విభాగంలో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్‌ఐ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దస్రు, భూపాలపల్లి జిల్లా కార్యదర్శి రమేష్ తెలిపారు. ఈ నెల 14 వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో చంటి పాల్గొంటాడని ప్రిన్సిపాల్ లాల్ వెల్లడించారు. ఆదివారం గురుకులంలో జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థిని గురుకులం ప్రిన్సిపాల్ లాల్, వైస్ ప్రిన్సిపాల్స్ రాజేందర్, మాధవి, పీడీ మహేందర్, పీఈటీ శ్రీనివాస్, కోచ్ వెంకటేశ్, అధ్యాపకులు అభినందించారు.

## 'బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేయాలి'

తొర్రూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : బ్రాహ్మణుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని బ్రాహ్మణ అఫీషియల్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి విజమూరి సుధాకర్ అన్నారు. ఆదివారం తొర్రూరులో ఆ సంఘం డైరీ, క్యాలెండర్‌ను బ్రాహ్మణ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. బ్రాహ్మణ విద్యార్థుల విదేశీ విద్యకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడం అభినందనీయమని, బ్రాహ్మణ పరిషత్‌ను బలోపేతం చేసి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు ఓలేటి లక్ష్మణాచార్యులు, వెంకటాచార్యులు, కృష్ణమోహన్, రాము, సుధీర్ ఉన్నారు.

## లక్నవరం టూరిస్టులకు లైఫ్ థ్రెట్!

ములుగు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవులు రావడంతో ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం చెరువు పర్యాటకులతో కిటకిటలాడుతోంది. ఆదివారం వందలాది మంది తరలిరావడంతో సందడి నెల కొంది. రెండు ఉయ్యాల వంతెనలపై రద్దీ కనిపించింది. బోటు షికారు చేస్తూ ప్రకృతిని ఆస్వాదించారు. అయితే పర్యాటకులను నియంత్రించడంలో.. జాగ్రత్తలు తీసుకోవడంలో అడుగడుగునా నిర్లక్ష్యం కనిపించింది. జెట్టీ బోట్స్‌లో పరిమితికి మించి ఎక్కించారు. ఒక్కరికి కూడా లైఫ్ జాకెట్ ఇవ్వలేదు. రద్దీ ఎక్కువగా ఉం దనే సాకుతో పదుల సంఖ్యలో పర్యాటకులను ఒకేసారి అనుమతించారు. వీరిలో చిన్నారులు, వృద్ధులు ఉన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాబడిపై ఉన్న శ్రద్ధ పర్యాటకు భద్రతపై తీసుకో కపోవడం విమర్శలకు తావిస్తోంది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటున్న లక్నవరం వద్ద ఇక నుంచైనా రక్షణ చర్యలను పక్కాగా చేపట్టాలని సర్వత్రా డిమాండ్ చేస్తున్నారు.



లైఫ్ జాకెట్లు లేకుండా పడవలో పర్యాటకులు

## హోరాహోరీగా మోడ్రన్ కబడ్డీ పోటీలు

కేసముద్రం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం స్టేషన్ ఉన్నత పాఠశాలలో సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి తండ్రి చెన్నకృష్ణారెడ్డి, సోదరుడు పురుషోత్తంరెడ్డిల జ్ఞాపకార్థం వేం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తొలి రాష్ట్రస్థాయి మోడ్రన్ కబడ్డీ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. మూడు రోజులపాటు నిర్వహించే ఈ క్రీడలను రెండోరోజు ఆదివారం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, ఎస్ఐ మురళీధర్‌రాజ్ క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. మోడ్రన్ కబడ్డీ అండర్ 17 బాలుర విభాగంలో రాష్ట్రంలోని 17 జిల్లాల జట్లు, బాలికల విభాగంలో 8 జిల్లాల జట్లు, సీనియర్స్ ఓపెన్ విభాగంలో పురుషులు ఏడు ఉమ్మడి జిల్లాల జట్లు, మహిళలు నాలుగు ఉమ్మడి జిల్లాల జట్లు ఈ పోటీలకు హాజరయ్యాయి. రబ్బర్ మ్యాట్‌లతో ఏర్పాటు చేసిన నాలుగు కోర్టులపై డే అండ్ నైట్ మ్యాచ్‌లను నిర్వహిస్తుండగా రాత్రి వరకు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో క్వార్టర్ ఫైనల్స్ ముగిశాయి. చివరి రోజైన సోమవారం సెమీ ఫైనల్, ఫైనల్స్ నిర్వహించనున్నట్లు మోడ్రన్ కబడ్డీ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి చెడుపల్లి ఐలయ్య, జిల్లా కార్యదర్శి కొప్పుల శంకర్ తెలిపారు.



కేసముద్రంలో మోడ్రన్ కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



సాయి ఆశ్రిత్‌ను సత్కరిస్తున్న క్రెడాయ్ నిర్వాహకులు

## స్థిరాస్తుల కొనుగోలుకు క్రెడాయ్ ఒక బెంచ్‌మార్క్

### యువ ఐఏఎస్ అధికారి శాకమూరి సాయి ఆశ్రిత్

హనుమకొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): క్రెడాయ్ ప్రాపర్టీషో లాంటి వాటిని ప్రజలు సందర్శించడంవల్ల ఆస్తుల క్రయవిక్రయాలపై ప్రజల్లో అవగాహన కలుగుతందని యువ ఐఏఎస్ అధికారి శాఖమూరి సాయి ఆశ్రిత్ అభిప్రాయపడ్డారు. హనుమకొండ వాస్తవ్యుడైన సాయి ఆశ్రిత్.. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసి జిల్లా రాజతలాబ్ డివిజన్ జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సాయి ఆశ్రిత్ సెలవుపై హనుమకొండకు వచ్చారు. సాయి ఆశ్రిత్ తండ్రి శాఖమూరి అమర్ రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఆయన క్రెడాయ్ వైస్‌ప్రెసిడెంట్ కూడా. క్రెడాయ్ ప్రాపర్టీ షోలో తన తండ్రి డైమండ్ స్పాన్సర్‌గా ప్రగతి డెవలపర్స్ పేరుతో ఏర్పాటు చేసిన స్టాల్‌ను చూసేందుకు సాయి ఆశ్రిత్ ఆదివారం కేయూ 100 ఫీట్లరోడ్డులోని జీఎంఆర్ గార్డెన్‌లోని క్రెడాయ్ ప్రాపర్టీ షోకు వచ్చారు. ఈ సందర్భంగా సాయి ఆశ్రిత్‌ను క్రెడాయ్ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఆశ్రిత్ క్రెడాయ్ ప్రాపర్టీ షోలో ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను సందర్శించారు. ప్రాపర్టీ ఎగ్జిబిట్స్, వివరాలు, ఇతరత్రా సమాచారాన్ని ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. క్రెడాయ్ ప్రాపర్టీ షోలో చేసిన ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాపర్టీ కొనుగోలు పట్ల ఆసక్తి కలిగినవారికి ఈ షోలో సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచినందుకు నిర్వాహకులను అభినందించారు.

## 'ఎమ్మెల్సీగా పూల రవీందర్‌ను గెలిపించాలి'



ఉపాధ్యాయులను ఓట్లు అభ్యర్థిస్తున్న ఎస్టీయూ నాయకులు

ములుగు కలెక్టరేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పూల రవీందర్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శిరుప సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్ కోరారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని గిరిజన భవన్ ఇండోర్ ప్లేగ్రౌండ్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులను ఓట్లు అభ్యర్థించారు. ఎస్టీయూ ములుగు మండల అధ్యక్షుడు మహ్మద్ హమీద్, నాయకులు పాడియా రవి, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రామప్పలో పర్యాటకుల సందడి

వెంకటాపూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రామప్ప ఆలయంలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ముందుగా రామలింగేశ్వరస్వామిని దర్శించుకోగా ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పర్యాటకులు శిల్పకళా సంపదను వీక్షించి ఆలయ విశిష్టత, చరిత్ర గురించి గైడ్‌ల ద్వారా తెలుసుకున్నారు. ఆలయానికి తూర్పుముఖ ద్వారాన ఉన్న నందీశ్వరుడి చుట్టు ప్రదక్షిణలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం సరస్సు వద్దకు చేరుకుని బోటులో విహరిస్తూ ప్రకృతి అందాలను తిలకించి ఆనందంగా గడిపారు.



రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న పర్యాటకులు

## నాడు సహ విద్యార్థులు.. నేడు సహోపాధ్యాయులు

ఈ ఫొటోలో కనిపిస్తున్న నలుగురు ఒకప్పుడు పాఠశాల, కళాశాల స్థాయిలో కలిసి చదువుకున్నారు. ఇప్పుడు ఒకే పాఠశాలలో కలిసి పనిచేస్తున్నారు. వీరిలో ఒకరు ప్రధానోపాధ్యాయులు కాగా, మిగతా ముగ్గురు ఉపాధ్యాయులు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల జడ్పీ పాఠశాలకు ఈ విద్యాసంవత్సరంలో ప్యానల్ గ్రేడ్ హెచ్‌ఎంగా పదోన్నతిపొంది ప్రధానోపాధ్యాయుడు బదిలీపై వచ్చారు బండారు నరేందర్. ఆయన కేసముద్రం స్టేషన్ జడ్పీ పాఠశాలలో 1988-89లో పదో తరగతి చదివారు. నాడు ఆయనతో కలిసి చదువుకున్న రాచకొండ యాకాంబ్రం స్కూల్ అసిస్టెంట్ గణితం ఉపాధ్యాయుడిగా రాగా.. ఫిజికల్ డైరెక్టర్ కొప్పుల శంకర్ కొద్దినెలల క్రితం ఈ పాఠశాలకు బదిలీపై వచ్చారు. అంతేకాకుండా 1991-94 హన్మకొండ ఆర్ట్స్ కళాశాలలో నరేందర్‌కు క్లాస్‌మెట్ అయిన స్కూల్ అసిస్టెంట్ గణితం ఉపాధ్యాయుడు తండా సదానందం కూడా ఈ ఏడాదే బదిలీపై ఈ పాఠశాలకు వచ్చారు. ఇలా నలుగురు మిత్రులు నాటి మిత్రబంధం.. నేటి సమన్వయంతో పాఠశాలలో పనిచేస్తున్నారు.

కేసముద్రం, ఆంధ్రజ్యోతి



మిత్రులు శంకర్, సదానందం, నరేందర్, యాకాంబ్రం

# జాతరకు ఐనవోలు ముస్తాబు

- పెద్ద సంఖ్యలో తరలి రానున్న భక్తులు
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


భక్తుల కోసం నిల్వ చేస్తున్న నీరు

ఐనవోలు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మల్లికార్జునస్వామి జాతరకు ఐనవోలు ముస్తాబవుతోంది. రాష్ట్రకూటులు.. కళ్యాణి చాళుక్యులు.. కాకతీయులు.. ఏ రాజులు, రాణుల చరిత్రను పరిశీలించినా.. వారంతా ఐనవోలు మల్లికార్జునస్వామి భక్తులేనని చారిత్రక ఆనవాళ్లు, శిలా శాసనాలు స్పష్టం చేస్తున్నాయి. ఐనవోలుకు జానపదుల జాతరగా వందల ఏళ్ల ఘనచరిత్ర ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండో పెద్దజాతరగా ప్రసిద్ధి గాంచిన ఐలోని జాతరలోని మల్లన్న సన్నిధికి తరలిరావాలని భక్తులు సిద్ధమవుతున్నారు. 13న భోగి, 14న మకర సంక్రాంతి రోజున రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లను చేయడానికి అధికారులు తలమునకలయ్యారు. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ ప్రావీణ్య జాతర నిర్వహణ ఏర్పాట్లపై ఇటీవల సమీక్ష నిర్వహించగా యుద్ధప్రాతిపదకన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

## నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

గత జాతరను దృష్టిలో ఉంచుకొని నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆలయ ప్రాంగణంలో విడిదిచేసే భక్తుల కోసం నీటి వసతిని కల్పించేందుకు మిషన్‌భగీరథ నీటిని ఓహెచ్‌ఆర్ ట్యాంక్ తోపాటు మినీ ట్యాంకులు, ప్రత్యేక నల్లాలు ఏర్పాటు చేశారు. నగరపాలక సంస్థ నుంచి వచ్చే 10 ట్యాంకర్లను అందుబాటులోకి ఉంచనున్నారు. స్నానాలు ఆచరించడానికి ప్రాంగణంలో ఐదు చోట్ల నల్లాలను ఏర్పాటు చేశారు. మహిళలు స్నానం చేసి దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలికంగా మూడు చోట్లు తడకలతో గదులను నిర్మించారు.

## మరుగుదొడ్లకు మరమ్మతు

భక్తుల సౌకర్యార్థం మూడు చోట్ల నిర్మించిన సుమారు 60 మరుగుదొడ్లకు మరమ్మతులు చేశారు. నగర పాలక సంస్థ నుంచి రెండు మొబైల్ మరుగుదొడ్ల బస్సులను ఎప్పటిలాగే భక్తులకు అందుబాటులోకి తీసుకవస్తున్నారు.

## నిరంతరం విద్యుత్ సరఫరా

జాతరలో నిరంతరం విద్యుత్తు సరఫరా కోసం 4 చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. సాంకేతిక లోపాలు తలెత్తి విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలిగితే మరో ఫీడర్ ద్వారా పునరుద్ధరించేందుకు విద్యుత్ సంస్థ అధికారులు ఏర్పాట్లు చేసుకున్నారు. విద్యుత్ చార్జీల కోసం దేవస్థానం ముందుగానే రూ.5లక్షలు చెల్లించింది.

## అందుబాటులో వైద్యం

స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది 24 గంటలు విధులు నిర్వహించడంతోపాటు మందులు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. 108 వాహనాన్ని అందుబాటులో ఉంచారు.


నూతనంగా తయారు చేసిన రథం

## భక్తులకు సౌకర్యాలు కల్పించాం



జాతరలో భక్తుల ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నాం. ప్రధానంగా నీరు, పారిశుధ్యం, విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి ఏర్పాట్లు చేశాం. దేవాదాయశాఖ ఏర్పాట్లకు అదనంగా ఖర్చుచేసింది. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అన్ని శాఖల అధికారుల సహకారంతో జాతరను విజయవంతం చేస్తాం.

అద్దంకి నాగేశ్వర్‌రావు, ఈవో

## పారిశుధ్యం

జాతరలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మూడు రోజులపాటు నగరపాలక సంస్థ నుంచి 180 మంది సిబ్బంది, 15 మంది జవాన్లు, 11 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఒక సూపర్‌వైజర్ పనిచేయనున్నారు. 2 ఫాగింగ్ యంత్రాలు, 10 చెత్తను తరలించే స్వచ్ఛ ఆటోలు, 2 రోడ్డును శుభ్రం చేసే స్వీపింగ్ వాహనాలు ఏర్పాటు చేశారు.

అదేవిధంగా ఐనవోలు, ధర్మసాగర్, హసన్‌పర్తి, దామెర మండలాలకు చెందిన గ్రామ పంచాయతీ కార్మికులు, సిబ్బంది సుమారు 200 మంది పనిచేయనున్నారు. 10 జీపీల ట్రాక్టర్లను సిద్ధం చేశారు. డస్ట్ బిన్‌లు మొత్తం 300 ఏర్పాటు చేశారు. దేవస్థానం నుంచి 30 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు.

## ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

హనుమకొండ డిపోకు చెందిన 50 ప్రత్యేక బస్సుల ద్వారా భక్తులను జాతరకు చేర్చనున్నారు. వరంగల్ నుంచి ప్రతీ 15 నిమిషాలకు ఒక బస్సు ఐనవోలుకు బయలుదేరుతుంది. ఐనవోలు - కాజీపేట - కొమురవెల్లి - వేములవాడలకు భక్తులు వెళ్లే విధంగా రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం కొనసాగుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

## ప్రత్యేక బృందాలు

ప్రతీ శాఖకు ఒక అధికారిని పనులు పర్యవేక్షించేందుకు నియమించారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది రెండు రోజుల పాటు విధులు నిర్వహించనున్నారు. ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు పెట్టి చేస్తున్న పనులను ఎప్పటికప్పుడు గ్రూపులో పోస్టు చేస్తున్నారు. ఈ గ్రూపులో కలెక్టర్ ప్రావీణ్య, ఆర్డీవో, డీపీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ తదితరులు ఉన్నారు.



ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు, లైన్లు

# మల్లన్న జాతర షురూ

ఐనవోలులో వైభవంగా ధ్వజారోహణం • ఉత్సవాలు ప్రారంభమైనట్లు అర్చకుల ప్రకటన • ఆలయానికి తరలి వస్తున్న భక్తులు • చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా గౌరీశంకర్


మహాన్యాసక రుద్రాభిషేక అలంకరణలో స్వామి


ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

ఐనవోలు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం ధ్వజారోహణం వైభవంగా జరిగింది. తొలుత స్వామి వారికి ఒగ్గుపూజారులు మేలుకొలుపు చేయగా శైవాగమ పద్ధతిలో అర్చకులు ప్రాతఃకాలంలో విఘ్నేశ్వరపూజ, రుద్రాభిషేకం, నూతన వస్త్రాలంకరణ చేశారు. ఉదయం గణపతి పూజ శైవశుద్ధి పుణ్యాహవాచనం నిర్వహించారు. దేవతలను ఆలయంలోకి ఆహ్వానిస్తూ ఉత్సవ ప్రారంభ సూచికగా కాషాయ ధ్వజ పతాకాలను చేతపట్టి మంగళవాయిద్యాలతో పరుష సూక్త మంత్ర పఠనంతో మూడుసార్లు గుడి చుట్టూ ప్రదక్షణలు చేసి ఆలయ శిఖరంపై ఎగురవేశారు. అనంతరం మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకము మహానివేదన నీరాజన మంత్రపుష్పం తీర్థప్రసాద వితరణ చేసి ఉత్సవాలు ప్రారంభమైనట్లు ప్రకటించారు. జాతర చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా ఎండోమెంట్ శాఖ సూపరింటెండెంట్ ఈ.గౌరీశంకర్‌ను నియమించారు.

## తరలి వస్తున్న భక్త జనం

మల్లన్న జాతర ఉత్సవాలు ప్రారంభం కావడంతో మల్లన్న సన్నిధికి భక్తుల రాక మొదలైంది. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తున్నారు. వివిధ జిల్లాల నుంచి వస్తున్న భక్తులు విడిది చేస్తుండటంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. నృత్యమండపం ఖాళీ స్థలం లేకుండా భక్తులు విడిదిచేశారు. రాత్రి పొద్దుపోయే వరకు భక్తుల రాక పెరుగుతూ పోయింది. సోమవారం జాతర ప్రాంగణం, పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడనున్నాయి. ఐనవోలుకు వచ్చే అన్ని ప్రధాన దారులు భక్తుల వాహనాలతో రద్దీ అయ్యాయి. ఆర్టీసీ బస్సులు ప్రయణికులను చేరవేస్తున్నాయి. వచ్చిన భక్తులు పట్నాలు, మొక్కులు తీర్చుకుంటూ స్వామి వారిని దర్శించుకుంటున్నారు. ఢమురకం, డోలు శబ్దాలతో ఆలయం ప్రాంగణం మారుమోగుతోంది. 13న సోమవారం భోగి, 14న మంగళవారం మకర సంక్రాంతి రెండు పర్వదినాల్లో లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లిస్తారు. కార్యక్రమంలో ఈవో అద్దంకి నాగేశ్వర్ రావు, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, వేద పండితులు అర్చకులు పాల్గొన్నారు.

## విధుల్లో చేరిన అధికారులు

ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ తిరుపతి, పర్వతగిరి సీఐ రాగజోగోపాల్ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి సీసీ పుటేజీలతో జాతర బందోబస్తును పరిశీలించారు. తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్యశాఖ, ఎక్సైజ్, డబ్ల్యూజీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది పోలీసులు జాతర విధుల్లో నిమగ్నమయ్యారు.

## నేడు మల్లన్న సన్నిధిలో భోగి పూజలు

భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో సోమవారం ఉదయం స్వామి వారికి ప్రాతఃకాలం మేలుకొలుపుతో పూజలు ప్రారరంభమవుతాయి. విఘ్నేశ్వరపూజ పుణ్యాహవచనలు, మహాన్యాసపూర్వక ఏకాదశి రుద్రాభిషేకములు, మంత్ర పుష్ప పూజలు జరుగున్నాయి.


త్రిశూలాలతో బీరన్న భక్తుల విన్యాసాలు


బోనంతో భక్తురాలు

# కొత్తకొండ జాతరకు పోయొద్దామా..

» నేడు ప్రారంభం కానున్న పెద్ద జాతర » ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు » 600 మంది పోలీసులతో బందోబస్తు

భీమదేవరపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కొత్తకొండ వీరభద్రస్వామి జాతరకు సర్వం సిద్ధమైంది. భక్తుల రద్దీని తట్టుకునే విధంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 13న భోగి పండగను పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి శ్రీచక్రార్చన తదితర పూజలు నిర్వహిస్తారు. సోమవారం సాయంత్రం కడిపికొండ, ఉల్లిగడ్డ దామెర గ్రామాల నుంచి కుమ్మరులు వారి ఎడ్లబండ్లకు ఊరేగింపుగా దేవస్థానానికి వస్తారు. వీరబోనం గద్దె వద్ద శివసత్తులు, కుమ్మరుల ఎడ్లబండ్లలతో వీరనృత్యాలతో వీర బోనం, వీర ఖడ్గం వేస్తూ స్వామి వారి ఆలయంలోకి ప్రవేశిస్తారు. స్వామివారికి, అమ్మవారికి బోనాలు సమర్పించడంతో జాతర ప్రారంభమవుతోంది. జాతరకు లక్షలాది మంది భక్తులు వస్తారని, అందుకు తగ్గ ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆలయం చుట్టూ విద్యుత్ దీపాల కాంతులతో వెలిగిపోతోంది. ఆలయంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా క్యూ లైన్లు, చలువ పందిళ్లు, ఆలయంలో ఫ్లైఓవర్లు నిర్మించామన్నారు. ఆదివారం నుంచే భక్తుల రద్దీ మొదలైంది. జాతర ప్రాంగణంలో రంగులరాట్నాలు, మిఠాయి, బొమ్మల దుకాణాలు విరివిగా వెలిశాయి. భోగి పండుగ సందర్భంగా సోమవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు.


ఆలయంలో ఏర్పాటు చేసిన ఫ్లైఓవర్లు

## వీరభద్రస్వామికి లక్ష బిల్వార్చన

కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయంలో స్వామివారికి ఆదివారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం లక్ష బిల్వార్చన చేశారు. ఒక్కోనామంతో స్వామివారిని కొనియాడుతూ బిల్వార్చన చేశారు. ఒక బిల్వా స్వామికి సమర్పిస్తే త్రిదలం, త్రికునాకారం, పాప సంహారం, ఏక బిల్వ శివార్పణం.. అంటూ పూజలు నిర్వహించారు. బిల్వార్చకంలో చెప్పబడిన మూడు జన్మల్లో చేసిన పాపం ఒక దలం సమర్పిస్తే తొలు గుతుందని శాస్త్రాలు చెబుతున్నాయని ఆలయ అర్చకులు తెలిపారు. మహిమ గల లక్ష బిల్వాలను స్వామి వారికి సమర్పించారు. భక్తులం దరూ కోరిన కోర్కేలు నెరవేరాలని, ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆల య ఈవో కిషన్ రావు, ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ గుప్తా తెలిపారు.

## బస్సు సౌకర్యం

కొత్తకొండ జాతరలో హుజూరాబాద్, హనుమకొండ, హుస్నాబాద్ ప్రాంతాల నుంచి కొత్తకొండ జాతరకు బస్సు సౌకర్యాలు కల్పించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ మూడు డిపోల నుంచి 20 బస్సుల చొప్పున నిరంతరం జాతరకు బస్సులు నడుపుతామన్నారు. మహాలక్ష్మి పథకం కింద జాతరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

## ఐదు వాటర్ ప్లాంట్లు ఏర్పాటు

కొత్తకొండ జాతరలో ఐదు వాటర్ ప్లాంట్లను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి ఉచితంగా అందజేశారు. ఉచిత తాగునీటి వాటర్ ప్లాంట్లను ఆదివారం సురేందర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, ఈవో కిషన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్టంపల్లి అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

## భారీ బందోబస్తు

సీపీ అంబర్ కిశోర్ ఝా, డీసీపీ సలీమా ఆదేశాల మేరకు ఏసీపీ తిరుమల్ ఆధ్వర్యంలో కొత్తకొండ జాతరలో 600మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు తెలిపారు. జాతరలో పోలీసులు మఫ్టీలో సైతం తిరుగుతూ, సీసీ కెమెరాలు, డ్రోన్‌లతో పర్యవేక్షిస్తామన్నారు. షీ టీమ్స్‌తో పాటు ఉమెన్స్ ఫోర్స్ పలువురు సీఐలు, ఎస్ఐలు తదితరులతో బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. కొత్తకొండ జాతరకు వచ్చే ముల్కనూర్, ముస్తాఫాపూర్, చంటయ్యపల్లి, మల్లారం నాలుగు దిక్కులా నాలుగు చెక్ పోస్టులు, పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామన్నారు. జాతరలో ఏమైనా ఇబ్బందులు జరగకుండా పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. వివిధ గ్రామాల నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామాల నుంచి పారిశుధ్య సిబ్బంది డీపీవో లక్ష్మీరమాకాంత్ ఆధ్వర్యంలో విధులకు హాజరయ్యారు.

జాతర బందోబస్తుకు వచ్చిన పోలీసులు



ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

## జాతరలో విస్తృత ఏర్పాట్లు



కొత్తకొండ జాతరలో భక్తులకు విస్తృత ఏర్పాట్లు కల్పించాం. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఉచిత వీఐపీ పాస్‌లను పూర్తిగా రద్దు చేశాం. వీఐపీ దర్శనం కావాల్సిన వారు రూ.200 టికెట్ కొనుగోలు చేసి స్వామివారిని దర్శించుకోవాలి. భక్తులకు ఆర్టీసీ, వైద్యం, మంచినీరు, పారిశుధ్యం, విద్యుత్, తదితర సేవలను పూర్తిగా అందిస్తాం. భక్తులకు ఎవరికీ ఇబ్బంది కలుగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం.

కిషన్‌రావు, ఆలయ ఈవో, కొత్తకొండ

# పేదోడి ఇంటికే సంక్షేమ పథకాలు

- 26 నుంచి మరో నాలుగు పథకాలు ప్రారంభం
- 16 నుంచి గ్రామ సభలు పారదర్శకంగా నిర్వహించాలి
- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం

హనుమకొండ టౌన్/హనుమకొండ కలెక్టరేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన తర్వాత పేదోడి ఇంటికి ఈ నెల 26న ప్రతీ సంక్షేమ పథకం చేరాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు అధికారులు ఈ నెల 16 నుంచి గ్రామాలకు వెళ్లి పారదర్శకంగా అర్హులను ఎంపిక చేసి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అన్నారు. ఆదివారం హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల జారీ వంటి సంక్షేమ పథకాల అమలుపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్లకు, వివిధ శాఖల అధికారులకు సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు, మంత్రులు సంక్షేమ పథకాల అమలుపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ పథకాల అమలుతీరుపై తీసుకోవాల్సిన నిర్ణయాలను కూలంకుశంగా చర్చించారు. సమీక్షలో రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర మహిళా శిశుసంక్షేమ, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క), రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాంనాయక్, నగరపాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, కేఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, హౌసింగ్ స్పెషల్ ఆఫీసర్ వినయ్ కృష్ణారెడ్డి, కలెక్టర్లు పి.ప్రావీణ్య, సత్యశారద, షేక్ రిజ్వాన్ భాషా, దివాకర, ఆరు జిల్లాల అదనపు కలెక్టర్లు, ఐటీడీవో మిశ్రా, సంబంధిత జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26వ తేదీ నుంచి నాలుగు పథకాలను ప్రారంభిస్తోందన్నారు. అర్హులైన వారు ఎంత మంది ఉన్నా.. ఈ నాలుగు ప్రభుత్వ పథకాలు అందించడంలో ప్రభుత్వం వెనకడుగు వేయదన్నారు. ఎక్కడ చిన్న తప్పిదం జరగకుండా ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రతీ లబ్ధిదారుడిని ఎంపిక చేసేందుకు కలెక్టర్లు కృషి చేయాలన్నారు. జిల్లాలో ఏ కార్యక్రమం జరుగుతుందో మొక్కుబడిగా చేయకుండా చిత్తశుద్ధితో అధికారులు ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదోడి కల నెరవేరుస్తుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డుల జారీకి మార్గదర్శకాలకు తిలోదకాలు ఇచ్చిందని పేర్కొన్నారు. గ్రామాలలో ఇందిరమ్మ కమిటీల సమక్షంలో గ్రామ సభలను నిర్వహించాలన్నారు. గ్రామ స్థాయిల్లో, మున్సిపాలిటీల స్థాయిల్లో లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి జాబితాలను సిద్ధం చేయాలన్నారు. గ్రామ సభ నిర్వహించే ముందు గ్రామాల్లో చాటింపు వేయించాలన్నారు. రాబోయే ఉగాది నుంచి పేదలకు పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సన్నబియ్యం ఇవ్వటానికి సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు. భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు రెండు విడతలుగా రూ.12వేలు అందజేస్తామన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఇల్లులేని నిరుపేద కుటుంబాలకు మొదటగా అవకాశం కల్పించాలన్నారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టి కృషితో ముందుకెళ్లాలన్నారు. ప్రతిపక్షాల విమర్శలను పట్టించుకోకుండా అర్హులనే గుర్తించి ఎంపిక చేయాలని సూచించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. గ్రామాలలో ఇందిరమ్మ కాలనీలు ఇప్పటికీ ఉన్నాయని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నిరుపేదలకు ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా పారదర్శకంగా అందేలా చూడాలని సూచించారు. హనుమకొండ


పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న మంత్రులు సురేఖ, సీతక్క


మంత్రి పొంగులేటికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్లు

జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లా స్థాయి అధికారులను మండల స్థాయి ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు తెలిపారు. గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. జిల్లాలోని 13 మండలాల్లోని 186 రెవెన్యూ గ్రామాలకు 158 బృందాలను నియమిస్తూ నాలుగు పథకాలకు సంబంధించి షెడ్యూల్ తయారు చేసిన ట్లు తెలిపారు. ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో లబ్ధిదా రుల్లో అర్హులను గుర్తించి 21 నుంచి 24 తేదీ వరకు ఆయా గ్రామ సభల్లో, మున్సిపాలిటీ వార్డుల్లో లిస్టులను ప్రదర్శిస్తామన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో సుమారు 3 వేల మంది వివరాలు గల్లంతయ్యాయని తెలిపారు. ఎడిట్ ఆప్షన్ కేటాయించి నమో దుకు అవకాశం కల్పించాలని మంత్రిని కోరారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ.. అధికారులు గ్రామాల్లో రోజంతా ఉండి నాలుగు పథకాలను అర్హులకు అందించేందుకు కృషి చేయాలన్నారు.

## అధికారులు తమాషాలు చేయొద్దు

హనుమకొండలో ఆదివారం సమీక్ష సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఇటీవల జరిగిన సర్వే వివిధ కార్యక్రమాల గురించి మాట్లాడుతుండగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మంత్రి పొంగులేటి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమాషా చేస్తున్నారా.. మీటింగ్ పూర్తయిన తర్వాత ఇద్దరు అధికారులు తనను కలవాలని హుకుం జారీ చేశారు. దీంతో అధికారులు కొంత అసహనానికి గురయ్యారు.

## మేడారంలో భక్తుల సందడి



వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

మేడారం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క, సారలమ్మను దర్శించుకొనేందుకు భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో వచ్చారు. వారాంత సెలవు కావడం, విద్యార్థులకు సంక్రాంతి సెలవులు కావడంతో భారీగా తరలివచ్చారు. మొదట జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించారు. తల్లుల గద్దెల వద్దకు చేరుకొని చీరె, సారె, బంగారం, యాట మొక్కులు సమర్పించారు.

## ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి : కలెక్టర్

ములుగు కలెక్టరేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లాలోని ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని కలెక్టర్ టీఎస్.దివాకర ఆకాంక్షించారు. ఈమేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రైతులు పాడిపంటలతో తులతూగాలని, ఆయా రంగాల్లో ప్రజలు శ్రేయస్సు సాధించాలని కాంక్షించారు. సంక్రాంతి పండుగ మన సంప్రదాయాలకు, సంస్కృతికి ప్రతీక అని, ఈపండుగ అందరిలో స్నేహభావం, సంతోషం, శ్రేయస్సు తీసుకురావాలన్నారు. ప్రజలందరూ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవడంతోపాటు స్వీయ భద్రతకు ప్రాముఖ్యత ఇవ్వాల పేర్కొన్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

మొగుళ్లపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్సిపేట గ్రామానికి చెందిన పొన్నాల ఆగయ్య శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఈవిషయం తెలుసుకున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు రాత్రి మృతదేహాన్ని సందర్శించి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్‌పార్టీ నాయకులు తక్కళ్లపల్లి రాజు, ఎమ్డీ.రఫీ, కూస సుమన్, నల్ల లింగారెడ్డి, యార మల్లారెడ్డి, ముకుందరెడ్డి తదితరులు ఉన్నారు.

# ఘనంగా వివేకానంద జయంతి






ములుగు, కాటారంలో వివేకానందుడికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ములుగు కలెక్టరేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వివేకానంద జయంతిని జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం హాజరయ్యారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రపంచ యువతపై అత్యంత ప్రభావాన్ని చూపిన చైతన్యమూర్తి స్వామి వివేకానంద అని అన్నారు. ప్రస్తుత రోజుల్లో నిరాశ, నిస్పృహలతో, మత్తు పదార్థాల బానిసత్వంలో కొట్టుమిట్టాడుతున్న యువతలో బలమైన ఆత్మవిశ్వాసం కలిగించడమే మన ముందున్న కర్తవ్యమన్నారు. ప్రతి ఒక్కరూ స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని విద్యావ్యవస్థ జ్ఞానాన్ని అందించడంతోపాటు సామాజిక బాధ్యతను, స్వావలంబనను పెంపొందించాలని అన్నారు. మండల అధ్యక్షుడు రాయంచు నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శీలమంతుల రవింద్రాచారి, నాయకులు జినుకల కృష్ణాకర్‌రావు, సూర్యదేవర విశ్వనాథ్, గంగిశెట్టి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

● చిట్యాల (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతాపార్టీ యువ మోర్చా ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. వివేకానందుడి చిత్రపటానికి బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు మైదం శ్రీకాంత్, మాచర్ల రఘు, గుండ సురేష్, వల్లాల ప్రవీణ్, గుర్రపు రవీందర్, శ్రీహరి, గజనాల రవీందర్, సదానందం, పిట్టల నాగరాజు, లటికె స్వామి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

● కాటారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, యువకులు, ఉపాధ్యాయులు వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం పండ్లు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వద్ద ఉన్న వివేకానందుడి విగ్రహానికి వివేకానంద విద్యాలయం కరస్పాండెంట్ వలుస వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పాగె రంజిత్‌కుమార్, నాయకులు దుర్గం తిరుపతి, పూసాల రాజేంద్రప్రసాద్, బొమ్మన భాస్కర్ రెడ్డి, జిల్లెల్ల శ్రీశైలం, మంత్రి సునీల్, బొంతల రవి, బొడ్డు శివ, చీర్ల అశోక్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి చీమల రాజు, నాయకులు మధు, పృథ్వీ, సందీప్, ఉపాధ్యాయుడు రాజారాం, యువకులు నజీర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ బాలికల కళాశాలలో చరిత్ర విభాగాధిపతి సిహెచ్. వెంకటయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివేకానంద చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ బి. రేణుక పూజమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ డి. నవీన్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి. జ్యోతి, ఫాతిమా, సంపత్, రమేష్, జీవవేణి, శేఖర్, భాస్కర్, విజయలక్ష్మి, కాంతితో పాటు వివిధ విభాగాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలపై అవగాహన



పెద్దగొల్లగూడెంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వెంకటాపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ వద్ద ఆదివారం పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రత నియమాలపై ప్రజలు, వాహనదారులకు అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా సీఐ బండారు కుమార్ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. వాహనదారులు సంబంధిత ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని, రోడ్డు ప్రమాదాలను నివారించడంలో సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎస్సై కొప్పుల తిరుపతిరావు, సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

● వాజేడు (ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని పెద్దగొల్లగూడెం, పేరూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని టేకులగూడెం గ్రామాల్లో వాజేడు, పేరూరు ఎస్సైలు రాజ్‌కుమార్, జి.కృష్ణప్రసాద్‌ల ఆధ్వర్యంలో వేర్వేరుగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సైలు రాజ్‌కుమార్, కృష్ణప్రసాద్‌లు మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్‌లో సెల్‌ఫోన్ వాడొద్దని, మద్యం తాగి వాహనాలు నడపొద్దని, త్రిబుల్ రైడింగ్ చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. నాలుగుచక్రాల వాహనదారులు సీటు బెల్టు పెట్టుకోవడంతోపాటు వాహన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ప్రతి వాహనదారుడూ రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ ప్రమాదాల నివారణకు పాటుపడాలన్నారు. అనంతరం గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాల్లో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి : సీపీఐ

ములుగు కలెక్టరేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సీపీఐ కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. ములుగులో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు, కర్షకులు, పేద, దిగువ, మధ్యతరగి ప్రజల కోసం, విద్యార్థులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, మధ్యాహ్న భోజన వంట కార్మికులు, ఆశాలు, అంగన్‌వాడీలు, తదితరవర్గాల ప్రజల కోసం నిత్యం పోరాటాలు సాగిస్తున్న సీపీఐపార్టీ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎన్నికల్లో పోటీచేస్తేనే ఆయా వర్గాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. బూర్జువావర్గ పార్టీలు, మతతత్వ పార్టీలను ఓడిస్తేనే పైవర్గాలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈసమావేశంలో నాయకులు ముత్యాల రాజు, బండి నర్సయ్య, వడి సారయ్య, బండారి శ్రీనివాస్, ఎమ్డీ.నాసర్, ఎమ్డీ.అమ్జద్‌పాషా, ఇంజం కొమురయ్య, జక్కుల ఐలయ్య, కొక్కుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి పోలీసుల గస్తీ

గోవిందరావుపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు ఊరు వదిలి దూర ప్రాంతాలకు వెళ్లేవారి ఇళ్ల రక్షణ కోసం పస్రా ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో పోలీసులు అర్ధరాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహిస్తూ గస్తీ కాస్తున్నారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ దూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంట్లో విలువైన వస్తువులు పెట్టకుండా చూసుకోవాలని, ఇంటి ఆవరణలో లైటు వెలిగేలా ఉండాలన్నారు. చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

## గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

గోవిందరావుపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవునిగుట్ట గొత్తికోయ గిరిజనులకు పస్రా ఎస్సై కమలాకర్ ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన గొత్తికోయలను సమావేశపరిచి మాట్లాడారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వ్యక్తులకు సహకరించడం, ఆశ్రయం కల్పించడం చట్టరీత్యా నేరమని అన్నారు. సంఘ వ్యతిరేకశక్తులకు సహకరించి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, గూడెంలో అనుమానాస్పదంగా కొత్త వ్యక్తులు సంచరించినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల కోసమే మభ్యపెడుతున్న సర్కారు

### బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి

మేడారం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే ప్రజలకు సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మభ్యపెడుతోందని బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి వ్యాఖ్యానించారు. మండలంలోని మేడారంలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతామని చెప్పి ఏడాది పూర్తయినా కాంగ్రెస్ ఆ విషయాన్ని విస్మరించిందని దుయ్యబట్టారు. డైవర్షన్ రాజకీయాలకు సీఎం రేవంత్‌రెడ్డి కేరాఫ్‌గా మారారని ఆరోపించారు. జనవరి 26 నుంచి సంక్షేమ పథకాలు అమలు చేయబోతున్నామని ప్రకటించడం ప్రజల దృష్టిని మరల్చడమేనన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో గ్రామాల్లో సర్వేలు చేస్తూ ప్రజలను అయోమయానికి గుర్తి చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రమణయ్య, లింగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రావు, నరేష్, రామయ్య, రాము, మొగిళి తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారుల ఎంపికకు సమావేశం

మల్హర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన సమావేశం ఆదివారం మండల కేంద్రమైన తాడిచర్లలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ నెల 16 నుంచి 20 వరకు గ్రామాల్లో బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో సర్వే నిర్వహించనున్నారు. 21 నుంచి 24 వరకు నాలుగు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన గ్రామసభలు నిర్వహించనున్నారు. 21న మండలంలోని అడ్వాలపల్లి, అన్‌సాన్‌పల్లి, చిన్నతూండ్ల, దుబ్బపేట, 22న ఎడ్లపల్లి, కొండంపేట, కొయ్యూర్, 23న ఇప్పలపల్లి, మల్లంపల్లి, మల్లారం, నాచారం, 24న పెద్దతూండ్ల, రుద్రారం, తాడిచర్ల గ్రామసభలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్యామ్‌సుందర్, తహసీల్దార్ రవికుమార్, ఏఓ శ్రీజ, ఏపీవో హరీష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● కాటారం (ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆదివారం ప్రభుత్వం జనవరి 26 నుంచి అమలు చేయబోయే నాలుగు పథకాలపై మండల స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల జారీ కోసం చేపట్టాల్సిన విధివిధానాలు, జాగ్రత్తలపై సమీక్షించారు. సాగుకు యోగ్యంగా లేని భూముల గుర్తింపు, లే ఔట్లు, నాలా కన్వర్షన్ భూముల వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఎంపీడీవో బాబు, తహసీల్దార్ నాగరాజు, ఏవో పూర్ణిమ సూచించారు. గ్రామసభలను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు, ఏవో పూర్ణిమ, డీటీ రామ్మోహన్, ఆర్ఐ వెంకన్న, కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, ఏఈవోలు, జీపీ ప్రత్యేకాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద శబ్దం చేసే సైలెన్సర్లున్న బైక్ సీజ్

కాటారం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో భారీ శబ్దం చేసే సైలెన్సర్‌ను బిగించిన బైక్‌ను ఆదివారం సీజ్ చేసినట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. వాహనాల తనిఖీల్లో భాగంగా మహాముత్తారం మండలం సింగంపెల్లి గ్రామానికి చెందిన కుర్సం శాంతకుమార్ తన బైక్‌కు బండికి వచ్చిన సైలెన్సర్‌ను తొలగించి భారీ శబ్దం చేసే మరో సైలెన్సర్‌ను అమర్చినట్లు గుర్తించి బైక్‌ను సీజ్ చేసి అతడిపై కేసు నమోదు చేశామన్నారు. రహదారులపై, ప్రధాన కూడళ్లలో భారీ శబ్దం చేసే సైలెన్సర్లతో కూడిన బైక్‌లతో సంచరిస్తూ ప్రజలకు ఇబ్బంది కల్గిరచేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కళారత్న అవార్డు గ్రహీతకు సన్మానం



సమ్మయ్యను సన్మానిస్తున్న తోటి కళాకారులు

కాటారం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిద్నెపల్లి జీపీ పరిధిలోని బొప్పారం గ్రామానికి చెందిన చిందు కళాకారుడు గడ్డం సమ్మయ్య జాతీయ కళారత్న అవార్డు పొందగా గ్రామస్థులు, తోటి కళాకారులు ఆయన్ను ఆదివారం ఘనంగా సన్మానించారు. కొన్నేళ్లుగా కళామతల్లికి సేవలు చేస్తున్న సమ్మయ్యకు రెండు రోజుల క్రితం బహుజన సాహిత్య అకాడమీ వారు జాతీయస్థాయి అవార్డు అందజేశారు. అనంతరం ఆయన్ను గ్రామస్థులు, కళాకారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిందు కళాకారులు నీలకంఠం, నాగభూషణం, సంజీవ్, శంకర్, రవి, అంజి, వంశీ పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న రెండు ఫోన్ల రికవరీ

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు బాధితులు పోగొట్టుకున్న రెండు ఫోన్లను భూపాలపల్లి పోలీసులు రికవరీ చేశారు. అట్టి ఫోన్‌లను ఆదివారం భూపాలపల్లి రెండో ఎస్సై రమేష్ బాధితులకు అప్పగించారు. భూపాలపల్లి పట్టణానికి చెందిన జగదీశ్వర్, దేవేందర్ ఇటీవల తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వారి సెల్‌ఫోన్‌లను పోలీసులు తక్కువ సమయంలోనే రికవరీ చేసి బాధితులకు అప్పగించారు.

## బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

చిట్యాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపేటలో బీఆర్ఎస్ గ్రామ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఈమేరకు పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ తెలిపారు. అధ్యక్షుడిగా తిరునహరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా బాసాని ఓదెలు, ఉపాధ్యక్షుడిగా జాలిగపు తిరుపతి, కోశాధికారిగా మొగిలి సంతోష్, సలహాదారులుగా తోట రాజయ్య, మ్యాకల మొగిలి, రామన్న, రాజయ్య, యూత్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శిగా చిగురు నరేష్, దొడ్డె నాగార్జునను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, నాయకులు పిట్ట సురేష్, మడికొండ రవీందర్, ఏరుకొండ రాజేందర్, దామెర రాజు, దొడ్డె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలను ప్రారంభించిన యూత్ కాంగ్రెస్ నేత



ములుగులో కబడ్డీ ఆడుతున్న ధనసరి సూర్య

ములుగు కలెక్టరేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలను ఆదివారం యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ధనసరి సూర్య జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకుని కబడ్డీ ఆడారు. అనంతరం క్రీడాకారులకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పీఆర్ఆర్ యూనిటీ, చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి మడూగురి నాగేశ్వరరావు, స్టార్ యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య హాజరయ్యారు. పోటీలను ప్రారంభించి, విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎమ్డీ. అయ్యూబ్ ఖాన్, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, యూత్ మండల అధ్యక్షుడు నవీన్, మండల నాయకులు ముక్కెర లాలయ్య, ఎమ్డీ. గౌస్, పీఆర్ఆర్ యూనిటీ, చారిటీ ట్రస్ట్ ప్రతినిధి మడూగురి నాగేశ్వరరావు, స్టార్ యూత్ కమిటీ సభ్యులు ముక్కెర బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

●కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుట్టాయిగూడెంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్య ప్రారంభించారు. జిల్లా స్థాయి క్రీడలను మారుమూల మండలం అయిన కన్నాయిగూడెంలో జరగడం చాలా ఆనందంగా ఉందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎం.డి.అఫ్సర్ పాషా, మండల ఇన్‌చార్జి జాడి రాంబాబు, ఎస్సై వెంకటేశ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోట నాగేష్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మారం సుమన్‌రెడ్డి, చింత క్రాంతి, సాంబశివ, భైరేష్, సుమన్, తాటి రాజబాబు పాల్గొన్నారు.

## రోడ్డుపై దిగబడిన ఇసుక లారీ



దిగబడిన ఇసుక లారీ

వెంకటాపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపుం మండలంలోని కొండాపురం గ్రామ సమీపంలోని ఆర్అండ్‌బీ రోడ్డుపై ఇసుక లారీ ఆదివారం దిగు బడింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారి మరమ్మతుల పేరుతో కాంట్రాక్టర్ రోడ్డును జేసీబీతో తవ్వి వదిలి పెట్టడంతో రోడ్డుమొత్తం గుంతలమయంగా మారింది. దీంతో రోడ్డుపై రాకపోకలు సాగించడం ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ప్రశాంతంగా టెక్నికల్ పరీక్షలు

భూపాలపల్లిటౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): టెక్నికల్ కోర్స్ పరీక్షలు రెండో రోజు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలు పటణంలోని జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించగా ఆదివారం డ్రాయింగ్ లోయర్ పరీక్షకు 148 మందికి 87 మంది మాత్రమే హాజరయ్యారని డీఈవో రాజేందర్ తెలిపారు. అలాగే డ్రాయింగ్ హయ్యర్‌లో 58 మందికి 44 మం హాజరయ్యారని, టైలరింగ్, ఎంబ్రాయిడరీ విభాగంలో 10మందికి 9 మంది హాజరై నట్లు తెలిపారు. మధ్యాహ్నం అదే తరహాలో జరిగినట్లు తెలిపారు.

## సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మొగుళ్లపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపల్లి గ్రామంలో భక్తమార్కండేయ చేనేత పారిశ్రామిక పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో కార్మికులు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి చేనేత కార్మికుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని నేతన్నహస్తం, నేతన్న భరోసా, నేతన్న బీమా వంటి పథకాలను ప్రవేశపెట్టడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు రాజయ్య, భిక్షపతి, సమ్మయ్య, రవి, రమేష్, కేదారి, శంకరయ్య, మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

## బొలేరో, కారు ఢీ.. ఇద్దరికి గాయాలు

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): బొలేరో వాహనం, కారు పరస్పరంగా ఢీకొనడంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున భూపాలపల్లి జాతీయ రహదారి మల్లంపల్లి క్రాస్ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ నుంచి కాటారం వైపునకు వెళ్తున్న బొలేరో వాహనం మల్లంపల్లి క్రాస్ సమీపంలో లారీని ఓవర్‌టేక్ చేయబోయి ముందుగా వెళ్తున్న కారును ఢీకొంది. దీంతో రెండు ఆ వాహనాలు రోడ్డుకిరువైపులా రోడు కిందకుదూసుకెళ్లాయి.

ముందు భాగంలో వాహనాలు రెండు దెబ్బతినగా.. కారులోని ఇద్దరికి స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. భూపాలపల్లి జిల్లా పరిధిలోని కాటారం మండల కేంద్రానికి చెందినవారుగా తెలియగా..వారికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియరాలేదు.

## భూపాలపల్లిలో సంక్రాంతి సందడి



భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సంక్రాంతి సందడి నెలకొంది. పండుగకు ముందే మార్కెట్లు కళకళలాడుతున్నాయి. మహిళలు ముగ్గుల కోసం రంగులను కొనుగోలు చేస్తున్నారు. పతంగులు దుకాణాలు వాడవాడలా వెలిశాయి. అలాగే ఈ పండుగకు పండి వంటలు ఎక్కువగా చేసుకుంటారు కాబట్టి కిరాణషాపులు, గిర్నీలు కిటకిటలాడాయి. వస్త్ర దుకాణాల్లో కూడా సంక్రాంతి సందర్భంగా వ్యాపారం జోరుగా సాగుతోంది.

- స్టాఫ్ ఫొటో గ్రాఫర్, భూపాలపల్లి (ఆంధ్రజ్యోతి)

# కలగాలె.. భోగభాగ్యం..

**నేడు భోగి పర్వదినం • ప్రారంభమైన సంక్రాంతి సంబురాలు**

వరంగల్ కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందడి మొదలైంది. తొలి రోజు భోగి పండుగగా పిలుస్తూ వేడుక ప్రారంభించుకుంటారు. భోగ భాగ్యాలతో విరాజిల్లాలని భోగి మంటలను పండుగను ప్రారంభిస్తారు. సోమవారం భోగి పండుగను పురస్కరించుకొని ఆదివారం అర్ధరాత్రి నుంచే పండుగ సందడి మొదలైంది. ఉదయం వేకువజామునుంచే రకరకాల ముగ్గులతో ఇంటి ముగిట మహిళలు, యువతులు ముగ్గులు వేసి గొబ్బెమ్మలను ఆవుపేడతో తయారు చేసి అందులో గరక పెట్టి పసుపు కుంకుమలు అద్ది రేగుపండ్లు, నవధాన్యాలతో అందమైన ముగ్గులో మధ్యలో పెట్టి అలంకరిస్తారు.

సంక్రాంతి పండగలో భోగి పండగ ప్రత్యేకత ఉంది. పాత వస్తువులను మంటల్లో వేసి చెడును పారదోలి మంచిని అస్వా దించడం భోగి విషిష్టతగా చెప్పవచ్చు. ఆడపడుచులు కొత్తబట్టలు వేసుకొని ఇంటి ఎదుట వాకిళ్లలో రంగురంగుల ముగ్గులు వే సి గొబ్బెమ్మలను పెట్టి నవ ధాన్యాలు, పూల రెమ్మలు పోస్తారు.

### పిండివంటలు

సంక్రాంతి అంటే ఫలహారాల పండుగ. సకినాలు, అరిసెలు, గ్యారలు, మడుగూలు చేసుకుంటారు. ప్రతీ సంక్రాంతికి ప్రతీ ఇంట్లో మూకుడు పెట్టాలనేది తెలుగు ప్రజల సంప్రదాయం. చిన్నారులు, మహిళలు ఇంటిల్లిపాది పిండి వంటలతో పండుగను సంతోషంగా జరుపుకుంటారు. నగరంలో పిండి వంటలు అమ్మే దుకాణాలు పెద్ద ఎత్తున ఉండటంతో కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్నాయి. సంక్రాంతి పండుగకు నాలుగు రోజులు సెలవులు రావడంతో ఎక్కడెక్కడో ఉంటున్న వాళ్లంగా కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి పండుగను జరుపుకోవాలని తమ సొంతూళ్లకు చేరుకుంటున్నారు.

### పతంగులతో యువత సందడి

వివిధ రకాల రంగురంగుల పతంగులను ఎగుర వేసేందుకు చిన్నారులు, యువకులు బీజీగా మారారు. పతంగుల దుకాణాల వద్ద సందడి నెలకొంది. రూ.10 నుంచి రూ.100 ధర పలికే పతంగుల అమ్మకాలు జరుగుతున్నాయి పతంగులను ఎగురవేసేందుకు అవసరమైన మాంజా, దారంబిండలు, చెరకులను చిన్నారులు, యువకులు కొనుగోలు చేసి సిద్ధం చేసుకున్నారు.

### చిన్నారులకు భోగి పండ్లు

సంక్రాంతి వేడుకల్లో తొలి రోజు వేకువజామునే లేచి ఇంటి ముంగిట భోగి మంటలు వేసి పండుగకు స్వాగతం పలుకుతారు. అనంతరం ఇంటి ముందు ముగ్గులు వేస్తూ గగ్గిరెద్దుల వారు గోవులతో పీకలు ఊదుతూ డూడూ బసవన్నలతో ఆట పాటలతో అందరిని అలరిస్తారు. భోగి సందర్భంగా దేవాలయాల్లో, గురుమందిరాల్లో భోగి పండ్లను పోసి పూజలు నిర్వహిస్తారు. ఇళ్లల్లో చిన్నారులకు కూడా ఆచారం ఉన్నవారు భోగి పండ్లు పోసి ఆశీర్వదిస్తారు.